## రైతుకు రూ.50వేల నగదు అందజేత



రైతు ధర్మేంద్రకు నగదును అందజేస్తున్న ఉప్పరి రవి

అయిజ, అక్టోబర్ 5: పట్టణంలో నగదు పోగొట్టుకున్న బాధిత రైతు ధర్మేంద్రకు ఎస్సై నరేశ్‌కుమార్ అందజేశారు. బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పట్టణానికి చెందిన ఉప్పరి రవికి రూ.50వేల నగదు దొరకగా, మానవతా ధృక్పథంతో పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత రైతు ధర్మేంద్ర పూర్తి వివరాలతో గురువారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సైని కలిశారు. పంటను విక్రయించగా వచ్చిన డబ్బుతో వెళ్తుండగా పడిపోయాయని తెలిపాడు. అన్ని కోణాల్లో విచారించిన పోలీసులు బాధిత రైతుకు నగదును అందజేశారు. నిజాయితీగా నగదును పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఉప్పరి రవిని ఎస్సై సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు భాస్కర్‌రాజు, శ్రీనివాసాచారి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు ఉన్నారు.

## ఆర్డీఎస్‌కు స్వల్ప వరద

అయిజ, అక్టోబర్ 5: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. గురువారం ఇన్‌ఫ్లో 834 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 414 క్యూసెక్కులు నమోదైంది. ఎగువ నుంచి వచ్చే వరద ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 420 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు కర్ణాటక ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.2 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 3,810 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,556 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 53.213 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1616.96 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## గులాబీ శ్రేణులు తరలిరావాలి

మల్దకల్, అక్టోబర్ 5: జిల్లా కేంద్రంలో పలుఅభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈనెల 8న వస్తున్నారని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నూతన బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మెడికల్ కళాశాలకు భూమిపూజ, ఇలా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2గంటలకు వైఎస్ఆర్ చౌరస్తాలో బహిరంగ సభ ఉంటుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళలు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని, సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ఎంపీపీ పెద్ద వీరన్న, పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, నాయకులు నరేందర్, మధు, పెద్దపల్లి అజయ్, జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

అలంపూర్, అక్టోబర్ 5: శక్తిపీఠం అలంపూర్ క్షేత్రంలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని ఈవో పురేందర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు, ముఖ్యఅర్చకుడు ఆనంద్ శర్మ తదితరులు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికలు, అమ్మ వారి ప్రసాదాలు అందజేశారు.

## దివ్యాంగ విద్యార్థికి ట్రై సైకిల్ అందజేత

కేటీదొడ్డి, అక్టోబర్ 5: మండల పరిధిలోని సోంపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు విద్యార్థి పెద్దవీరన్నకు మండల విద్యాధికారి సురేశ్ ఆదేశాల మేరకు గురువారం ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు యుగంధర్, పాపయ్య, ఐఈఆర్‌పీలు తదిరులు ఉన్నారు.

## నూతన న్యాయమూర్తికి శుభాకాంక్షలు

గద్వాలఅర్బన్, అక్టోబర్5: జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన నేరేళ్ల వెంకట హైమా పూజితను గురువారం బార్ అసోసియేషన్‌లో, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, ఆదిమల్లారెడ్డి, వెంకటేశ్, సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, ఖాజామైనుద్దీన్, పూజారి శ్రీధర్, షఫీఉల్లా, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచులకు బతుకమ్మ చీరలు

- పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- క్రీడాకారులకు క్రీడాపరికరాలు అందజేత



మల్దకల్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్, అక్టోబర్5: తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగకుగానూ ప్రత్యేకంగా బతుకమ్మ పండుగను నిర్వహించుకుంటున్నామని ఈ పండుగకు రాష్ట్రంలోని పేదింటి మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతువేదిక భవనంలో ఎంపీపీ రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీకేఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరాకు సీఎం కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ఆడపడుచులకు చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. 2017 నుంచి 2022 వరకు 5.81 కోట్ల చీరలను రాష్ట్రంలో మహిళలకు పంపిణీ చేసిందన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పనలో భాగంగానే బతుకమ్మ చీరలను వారితో ప్రత్యేకంగా 250 డిజన్లతో చీరలను ప్రభుత్వం తయారు చేయిస్తున్నారన్నారు. ప్రతి మహిళ కూడా గ్రామాలోని రేషన్ షాపులలో డీలర్ల దగ్గర తీసుకోవాలని సూచించారు..

### ఓట్లకోసం వస్తున్నారు.. జాగ్రత్త

ఎన్నికలు దగ్గర్లోనే ఉన్నాయని, మీ గ్రామాల్లోకి కొత్తవారు తమకే ఓటు వేయాలని వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలు వారిని నిలదీయాలని చెప్పారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ రవిప్రకాశ్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ఎంపీపీ పెద్ద వీరన్న, సర్పంచ్ యాకోబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటన్న, రైతు బంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచుల సం ఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పెద్దగోపాల్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ విష్ణు, సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, నాయకులు నరేందర్, మధు, అజయ్, పెద్దమల్లన్న, ప్రభాకర్, పరశురాముడు, నర్సింహారెడ్డి, భాస్కర్, తిమ్మరాజు, వార్డుమెంబర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

### వడ్డేపల్లి మండలంలో...



తనగలలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

వడ్డేపల్లి, అక్టోబర్ 5: మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. 5,527 చీరలు పంపిణీ చేయనున్నామని ఎంపీడీవో రవీంద్ర తెలిపారు. తనగలలో సర్పంచ్ రాణి, ఎంపీపీ రజితమ్మ సమక్షంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారామిరెడ్డి, కార్యదర్శి మోహన్, రేషన్‌డీలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏటా బతుకమ్మ చీరలు

అయిజ, అక్టోబర్ 5: ఆడబిడ్డల అభ్యున్నతే లక్ష్యమని సర్పంచ్ నీలకంఠారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలకు సర్కారు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే సంకల్పంతోనే ప్రతి ఏటా చీరలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డీలర్లు, మహిళలు పాల్గొన్నారు.



భూంపురంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నీలకంఠారెడ్డి

## జములమ్మ ఆలయంలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్, అక్టోబర్ 5: నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం లైటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. నూతనంగా పాలక మండలి ఆలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఎస్.కేశవ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్, సతీశ్‌కుమార్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

గద్వాల మండల పరిధిలోని శెట్టిఆత్మకూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యుడు సలేంద్రనాథ్, భీమన్న ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాములు, కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, లక్ష్మన్న, హనుమంతు ఉన్నారు.

## మంత్రి సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



అలంపూర్ చౌరస్తాకు తరలివెళ్తున్న అయిజ మండల బీఆర్ఎస్ శ్రేణులు


వడ్డేపల్లి, అక్టోబర్ 5: మండలంలోని ఆయా గ్రామాల నుంచి అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల దవాఖాన, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి నిరంజన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం, అజయ్‌కుమార్ పిలుపుమేరకు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులుగౌడ్ ఆధ్వర్యంలో వాహనాల్లో, మోటర్ సైకిళ్లపై తరలివెళ్లారు.

### అయిజ నుంచి తరలిన శ్రేణులు

అయిజ, అక్టోబర్ 5: అలంపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన వందపడకల దవాఖాన ప్రారంభోత్సవానికి గురువారం అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలుగ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ఆదేశాల మేరకు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు వివిధ వాహనాల్లో తరలారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజాలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు నిర్మించిన వంద పడకల దవాఖాన ప్రారంభోత్సం చేయడం శుభ పరిణామమని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు పేర్కొన్నారు.

## శ్మశానం దారి కోసం ఘర్షణ

ధరూరు, అక్టోబర్ 5: మండల కేంద్రంలో శ్మశానం దారిని చదును చేస్తున్న క్రమంలో ఇరువురు ఘర్షణ పడ్డారు. శ్మశాన వాటికకు వెళ్లడానికి పారుచర్లకు వెళ్లే రోడ్డును గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు చదును చేస్తుండగా, రోడ్డుకు ఆనుకుని ఉన్న వ్యాపార భవనాల యజమానికి, గ్రామ పంచాయతీ సభ్యులకు స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. రోడ్డును ఆక్రమించుకుని దుకాణ సముదాయం నిర్మించారని గ్రామస్తులు పంచాయతీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చదును చేస్తున్న క్రమంలో దుకాణ యజమాని కుటుంబీకులతో, గ్రామస్తులకు స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై శివానందన్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని, ఇరువురికీ నచ్చ చెప్పి శాంతింపజేశారు. చదును చేసిన తర్వాత సర్వే చేయించుకుని రోడు సరిహద్దులు తేల్చేంత వరకు సంయమనం పాటించాలని చెప్పారు.



గొడవ పడుతున్న వారితో మాట్లాడుతున్న ఎస్సై శివానందన్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి